1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
ఆదివారం | జులై 14, 2024 | www.navatelangana.com

మద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు కొత్త ఎస్సై వచ్చేదెప్పుడో?

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ బదిలీపై వెళ్లి 15 రోజులు కావస్తున్నప్పటికీ, కొత్త ఎస్సై ఇంతవరకు రాకపోవడంతో మద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు కొత్త ఎస్సై వచ్చేదెప్పుడనే చర్చలు మండల ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మద్నూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్నూర్, డోంగ్లి మండలాలున్నాయి. కొత్త ఎస్సై వస్తారా రారా అన్నది చర్చనీయాంశంగా కనిపిస్తోంది. ఇక్కడికి కొత్త ఎస్సైగా ఒకరి పేరు వినబడ్డ ఆ ఎస్సై ఇక్కడికి రాలేకపోతున్నట్టు చర్చలు జరుగుతున్నాయి. ఉమ్మడి మండలానికి ఎస్సై పోస్టు భర్తీ కాలేకపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కొత్త ఎస్సైని నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైలు కింద దూకి హెూంగార్డ్ ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

రైలు కిందదూకి హెూంగార్డ్ ఆత్మహత్య చేసుకున్నాడు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహించే హెూంగార్డు సంపత్(43) శనివారం తెల్లవారుజామున రైలు కింద దూకి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. శనివారం తెల్లవారుజామున విధులకు వెళ్తున్నానని ఇంట్లో వారికి చెప్పి బయటకు వచ్చిన సంపత్ 4గంటల ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎల్లమ్మగుట్టకు చెందిన సంపత్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అయితే సంపత్ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్టు, దాంతో పాటు అప్పుల బాధ తీవ్రం కావడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబీకులు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రైలులో నుంచి పడి ఇద్దరు మృతి

- దినసరి కూలీలుగా అనుమానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని నడుస్తున్న రైల్లో నుంచి పడి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు (30-35) రైలు పట్టాల పక్కనే ఉన్న డ్రైనేజీలో పడి అక్కడిక్కడే మృతిచెందారు. ఈ ఘటన ఇందల్‌వాయి రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. శనివారం ఉదయం ఇందల్‌వాయి రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ట్రాక్‌మెన్ కాంతి ఐలయ్య ట్రాక్ వెంట నడుస్తుండగా డ్రైనేజీలో రెండు మృతదేహాలు కనిపించడంతో స్టేషన్ మాస్టర్‌కు సమాచారం చేరవేశారు. వెంటనే నిజామాబాద్ రైల్వే ఎస్ఐ సాయిరెడ్డికి జరిగిన విషయంపై సమాచారం అందజేశారు. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి ఆదేశానుసారం కామారెడ్డి రైల్వే ఎస్ఐ ఎస్.తావునాయక్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. వారి ఆచూకీ కోసం మృతుల వద్ద రైలు టికెట్, ఆధార్‌తోపాటు ఇతరత్రా ఎలాంటి ఆధారాల కోసం వెతికినా ఏమీ లభించలేదు. మృతుల చేతులపై పచ్చబొట్టు హిందీలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. వీరు నిజామాబాద్ లేక మహారాష్ట్రకు చెందిన వారై ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కామారెడ్డి జీపీఎస్ ఎస్సై తావునాయక్ మాట్లాడుతూ స్టేషన్‌కు కూతవేటు దూరంలో రైలు పట్టాల పక్కన డ్రైనేజీలో రాత్రి సమయంలో గుర్తు తెలియని ట్రైన్‌లో ప్రయాణిస్తున్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుని ఉంటుందని, ఈ కేసును నిజామాబాద్ రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి పరిశీలిస్తారని వెల్లడించారు. విషయం తెలుసు కున్న ఇందల్‌వాయి ఎస్సై మనోజ్‌కుమార్ ఘటన ప్రదేశానికి వెళ్లి మృతదేహాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరు రోజూ దినసరి కూలీ పనులు చేస్తుండే వారని, మృతుల సంబంధీకులు ఎవరైనా ఉంటే నిజామాబాద్ రైల్వే ఎస్ఐ సాయిరెడ్డిని సంప్రదించాలని సూచించారు. కాగా గుర్తు తెలియని వ్యక్తులుగా పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రెండు వారాలుగా
ముఖం చాటేసిన వర్షం

- మొలక దశలోనే వాడిపోతున్న పత్తి పంట
- పంటలను కాపాడుకునేందుకు పడరాని పాట్లు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మేఘాలు కదలాడటం లేదు. వర్షం కురవడం లేదు. భూమిలో వేసిన విత్తనం మొలకెత్తి ఆయువు కోసం ఆశగా ఎదురుచూస్తోంది. కానీ వర్షం మాత్రం కురవడం లేదు. నీళ్లు లభించక మొలకెత్తిన పత్తి అలాగే వాడిపోయే పరిస్థితి వచ్చింది. 15రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. కొన్నిచోట్ల వేసిన విత్తనాలు భూమిలోనే ఉండిపోవడంతో అవి మొలకెత్తడం కష్టంగా మారింది. సకాలంలో వర్షాలు రాక వానకాలం సాగు ఆలస్యమైందని ఆందోళన చెందుతున్న అన్నదాతలకు తాజా పరిస్థితి మరింత అవస్థలకు గురిచేస్తోంది. ప్రకృతిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతుల దుస్థితి వర్ణనాతీతంగా మారింది. మొలకదశలో ఉన్న పత్తిని కాపాడుకునేందుకు కొందరు రైతులు డబ్బాలతో నీళ్లుపట్టిస్తుండగా.. మరికొందరు రైతులు స్ప్రింకర్లతో నీటిని అందిస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పెద్దకొడప్‌గల్ మండలంతో పాటు పరిసర ప్రాంత గ్రామాలలో వర్షాలు పడక అన్నదాతలు అయోమయంలో పడ్డారు. ప్రతియేటా మృగశిరకార్తె ముగియగానే కురవాల్సిన వర్షాలు.. ఆలస్యంగా వచ్చాయి. 15 రోజుల క్రితం రెండు రోజుల పాటు ఏకధాటిగా కురవడంతో రైతులంతా విత్తనాలు వేశారు. మండలంలో 15,500 ఎకరాల వ్యవసాయ భూమి సాగులో ఉంది. ఇందుకుగాను దాదాపు 3000 ఎకరాల నుండి 3,500 పత్తి పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు పక్షం రోజుల నుంచి వర్షాలు కురవడం లేదు. అక్కడక్కడ కురిసిన చిన్నపాటి వర్షానికి రైతులు విత్తనాలు వేశారు. వర్షాలు రాకపోవడంతో తీవ్ర ఆందోళన చెందిన రైతులకు 15 రోజుల క్రితం కురిసిన వర్షం ఆనందాన్ని తీసుకొచ్చింది. ఆ రెండు రోజుల పాటు వానలకు దాదాపు 90శాతం రైతులు విత్తనాలు విత్తుకున్నారు. కానీ మరుసటి రోజు నుంచి వర్షాలు ముఖం చాటేయడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. తడి నేలలో వేసిన విత్తనాలు కావడంతో ప్రస్తుతం అవి మొలకెత్తి ఆయువు కోసం ఎదురుచూస్తున్నాయి.

15 రోజుల క్రితం ఈ ఏడాది 158మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా కేవలం 45మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో సుమారు 100మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు రాకపోతే పత్తి మొలకలు పూర్తిగా వాడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



సంరక్షణ కోసం తంటాలు..!

గత రెండు వారాలు వర్షాలు రాకపోవడం.. ఎండతీవ్రత అధికంగా ఉండటంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. వేసిన విత్తనాలు మొలకెత్తి వర్షం కోసం ఎదురుచూస్తుండటంతో వాటిని కాపాడుకోవడం కర్షకులకు పెద్ద సవాలుగా మారుతోంది. చిన్నసన్నకారు రైతులు మొలకెత్తిన మొలకలకు డబ్బాలతో నీళ్ల చల్లుతూ సంరక్షించే ప్రయత్నం చేస్తున్నారు. కొందరు రైతులు ప్రత్యేకించి కూలీలను పెట్టి మరీ మొలకలకు నీళ్ల పట్టిస్తున్నారు. ఇంకొందరు రైతులు స్ప్రింకర్ల ద్వారా ఆయువు పోస్తూ రక్షించుకుంటున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వేసవిని తలపిస్తుండటంతో ఒకటి, రెండు రోజుల్లో వర్షాలు వస్తాయా రావా అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వర్షం కోసం ఎదురుచూస్తున్నాం



15 రోజుల క్రితం వర్షం కురవడంతో 10ఎకరాల్లో పత్తి పంట వేశాను. తడి నేల ఉండటంతో ప్రస్తుతం మొలకెత్తాయి. కానీ గత 15 రోజుల నుంచి వర్షం రాకపోవడంతో ఎండిపోయే దశకు చేరుకున్నాయి. మరో రెండు రోజులు వర్షం రాకపోతే మొలకలు వాడిపోయే పరిస్థితి ఉంది. వర్షం రాకపోతే తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

\- కర్తాల్ నాయక్

నమ్మించి నట్టేట ముంచిన ఘనుడు

- గల్ఫ్ కార్మికులకు రూ.4 కోట్లు టోకరా
- బ్యాంకు రేటు కంటే ఎక్కువ ఇస్తానని ఆశచూపి మోసం
- ఆందోళన చెందుతున్న బాధితులు
- న్యాయం చేయాలంటున్న కార్మికుల కుటుంబాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బతుకుదెరువు కోసం భార్య పిల్లలను వదిలి పొట్ట చేత పట్టుకొని గల్ఫ్ దేశమైన సౌదీ అరేబియా వెళ్లారు. అక్కడ దొరికిన పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్న గల్ఫ్ కార్మికులను మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన రాజాగౌడ్ అనే వ్యక్తి నమ్మించి నట్టేట ముంచాడు. సౌదీ అరేబియాలో పలువురు గల్ఫ్ కార్మికులకు రూ.4కోట్లకు పైగా వసూలు చేసి పారిపోయి వచ్చాడు. దీంతో బాధిత గల్ఫ్ కార్మికుల కుటుంబాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. బాధితుల కథనం ప్రకారం.. సౌదీ అరేబియాలో పని పేరుతో వెళ్లిన రాజాగౌడ్ వెళ్లిన కొద్ది రోజుల్లోనే హుండీ వ్యాపారం మొదలుపెట్టినట్టు తెలిసింది. తను వెళ్లిన కొద్ది రోజులకే తన తమ్ముడు రఘుగౌడ్‌ను కూడా సౌదీ అరేబియాకు రప్పించుకున్నాడు. అక్కడ పనిచేసే తోటి కార్మికులకు కుటుంబ సభ్యులకు పంపించే డబ్బులను బ్యాంకులో ఇచ్చే రేటు కంటే ఎక్కువ రేటును ఇస్తానని నమ్మబలికాడు. మాట ప్రకారం తనపై నమ్మకం కలిగేలా గల్ఫ్ కార్మికుల డబ్బులను వారి వారి కుటుంబ సభ్యులకు అందించాడు. తనను గల్ఫ్ కార్మికులు నమ్మేలాగా వారితో నమ్మకంగా హుండి వ్యాపారం నడిపిన రాజాగౌడ్ హుండి ద్వారా డబ్బులు పంపిస్తే ఎక్కువ రేటు వస్తుందని అందరు నమ్మేలా చేశాడు. తన హుండి వ్యాపారాన్ని నిజామాబాద్ జిల్లాతో పాటు పక్క జిల్లాలకు కూడా విస్తరించాడు. హుండి ద్వారా ఇంటికి డబ్బులు పంపించే గల్ఫ్ కార్మికులను పెద్ద సంఖ్యలో తన కస్టమర్లను చేసుకున్నాడు. ఇంటి వద్ద ఎక్కువ రేటుకు ఇస్తున్నానని చెప్పి గల్ఫ్ కార్మికులను నమ్మించి వారి వద్ద డబ్బులు వసూలు చేశాడు. రాజాగౌడ్ నమ్మిన పలువురు గల్ఫ్ కార్మికులు తమ ఇంటి వద్ద ఇవ్వాలని పెద్దఎత్తున గల్ఫ్ రియల్స్ ఇచ్చారు. అంతేకాకుండా అందరితో నమ్మకంగా వ్యవహరించిన రాజాగౌడ్, రఘు గౌడ్ పలువురు వద్ద ఎక్కువ వడ్డీ ఆశచూపి లక్షల్లో అప్పుగా డబ్బులు వసూలు చేశారు. గల్ఫ్ కార్మికుల అత్యాశను తమకు అనుకూలంగా మార్చుకున్న అన్నదమ్ములు వారి వద్ద నుంచి అందినకాడికి వసూలు చేశారు. వసూలు చేసిన సుమారు రూ.4కోట్ల వరకు సొమ్మంతా హవాలలో పంపించుకొని అక్కడ తమ బిచానను ఎత్తేసి ఇండియాకు పరారై వచ్చినట్లు తెలుస్తోంది. కుటుంబీకులకు డబ్బులు పంపించిన గల్ఫ్ కార్మికులు ఫోన్ ద్వారా డబ్బులు అందాయా అని వాకబు చేయగా అందలేదని చెప్పడంతో కంగుతిన్నారు. అన్నదమ్ముల విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న గల్ఫ్ కార్మికులు రాజాగౌడ్ తమను నట్టేట ముంచాడని తమ కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేసుకున్నారు. బాధితుల కుటుంబ సభ్యులు బషీరాబాద్‌కు వచ్చి వాకాబు చేయగా రాజాగౌడ్ ఇంటికి తాళం వేసి ఉండడంతో లబోదిబోమంటున్నారు. రాజాగౌడ్ అన్నదమ్ములు తాము అక్కడ నుంచి వస్తున్నప్పుడే ఇక్కడ కుటుంబ సభ్యులను కూడా ఇండ్లు వదిలి వెళ్లాలని అలర్ట్ చేసినట్టు తెలుస్తోంది. గల్ఫ్ కార్మికుల నుండి హుండి ద్వారా అధిక రేటు ఇస్తానని వసూలు చేసిన డబ్బులను, అప్పుగా తీసుకున్న డబ్బులతో కుటుంబంతో కలిసి అన్నదమ్ములు పరారైనట్లు బాధిత కార్మికుల కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. కన్నవాళ్ళను, కట్టుకున్న వాళ్లను వదిలేసి దేశం గాని దేశం వెళ్లి చెమటోడ్చి సంపాదించిన డబ్బులను తీసుకొని రాజాగౌడ్ నమ్మించి ముంచడంతో గల్ఫ్ కార్మిక కుటుంబాల సభ్యులు పలువురు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఇప్పటికే పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. పోలీసులు కూడా రాజాగౌడ్‌ను పట్టుకునేందుకు చర్యలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా అతని స్నేహితులను పలువురిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.



గల్ఫ్‌కార్మికులను మోసం చేసిన రాజాగౌడ్, రఘుగౌడ్



మాట్లాడుతున్న సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన
హామీలను అమలు చేయాలి

- సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను సత్వరం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు, మహిళలకు ఆర్థికసాయం అందజేయాలని, కౌలు రైతులకు రైతు భరోసా, పంటల బీమా పథకం, బీమా ప్రీమియం ప్రభుత్వం భరించి అమలు చేయాలన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని, రెండు లక్షలలోపు రుణమాఫీ అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం హామీనిచ్చిన విధంగా ధాన్యానికి ఇతర పంటలకు బోనస్ ఇవ్వాలని, వ్యవసాయ ప్రణాళిక వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. అన్ని రకాల పెన్షన్‌లను పెంచాలన్నారు. ఇండ్ల స్థలాలు లేని వారందరికీ ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఇందిరమ్మ పథకం కింద ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మోతీరాం నాయక్, సురేష్‌గొండ, ఎల్లన్న నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అధికారి వేధింపులతో రికార్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య

- జేబులో సూసైటీ నోట్

నవతెలంగాణ-రామారెడ్డి

అధికారి వేధింపులు తట్టుకోలేక మనస్థాపం చెందిన రికార్డ్ అసిస్టెంట్ ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి మండలం గూడెం గ్రామానికి చెందిన తెడ్డు ప్రశాంత్ (28), తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. 'డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్ మానసికంగా వేధిస్తున్నాడు. వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నా.'నని సూసైడ్ నోట్‌ను రాసి దానిని జేబులో పెట్టుకొని మండలంలోని కన్నాపూర్ అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

బీడీ కార్మికుల పిల్లల ఉపకారవేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బీడీ కార్మిక ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ బీడీ కార్మికుల పిల్లలకు అందించే ప్రీమెట్రిక్ (1నుంచి 10వ తరగతి వరకు) పోస్ట్‌మెట్రిక్ (11వ తరగతి నుంచి ప్రొఫెషనల్ డిగ్రీ వరకు), ఉపకార వేతనాల కోసం 2024-25 విద్యా సంవత్సరం కొరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ప్రీమెట్రిక్ 31-08-2024 వరకు, పాస్ మెట్రిక్కు 31-10-2024 తేది వరకు చివరి గడువు ఉందని పేర్కొన్నారు. WWW. scholarships. gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవాల సూచించారు. వివరాలకు మండల కేంద్రంలోని అయ్యప్పనగర్‌లో గల బీడీ కార్మిక ఆస్పత్రిలో సంప్రదించాలని పేర్కొన్నారు.

వసతుల్లేవ్..

- 700ల పైచిలుకు విద్యార్థులకు భోదన
- పదిమంది ఉపాధ్యాయుల కొరత
- జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాల దుస్థితి

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు వసతులు అందని ద్రాక్షలా మారాయి. జిల్లాలోనే అత్యధికంగా ఈ ప్రభుత్వ పాఠశాలలో సుమారుగా 700లకుపైగా విద్యార్థిని, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం ఒక హెచ్‌ఎం, ఒక పీఈటీ, ఎనిమిది మంది ఉపాధ్యాయులున్నారు. వాస్తవానికి ఇరువై రెండు మంది ఉండాల్సింది పోయి పది మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఇటివలే రాష్ట్ర ప్రభుత్వం జనరల్ ట్రాన్స్‌ఫర్, భార్యభర్తలకు ఒకే చోట ఉండడానికి వీలుకల్పించింది. ఉద్యోగంలో పదోన్నతులు కల్పించారు. వారంతా రీలీవ్ అయిపోయారు. వచ్చేవారు రాకపోవడంతో ఉపాధ్యాయుల కొరత ఏర్పడి విద్యార్థుల చదువుపైన ఎఫెక్ట్ పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

విద్యార్థులు చేరేందుకు క్యూకడుతున్నారు..

పాఠశాలలో అసలే సమస్యలుండగా.. గ్రామాల నుంచి మాత్రం విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

గదుల కొరత..

సుమారుగా ఏడు వందల పైచిలుకు విద్యార్థులకు పాఠశాలలో ఉన్న గదులు సరిపోకపోవడంతో కింద కూర్చోపెడితే విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయమై ఉపాధ్యాయులను ప్రశ్నించిన సందర్భాలూ ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



పాఠశాలలో ప్రేయర్ చేస్తున్న విద్యార్థులు

వివాహితకు వేధింపులు

- భర్త, అత్తమామలపై కేసు నమోదు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

వసంత అనే వివాహితను వేధిస్తున్నారని శనివారం ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో ఆమె భర్త, అత్త మామపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామ పరిధిలోని కుర్దు జానకంపల్లి తండాకు చెందిన కాత్రోత్ వసంతకు 12 సంవత్సరాల క్రితం పాపన్నపేట మండలం చిట్యాల తండాకు చెందిన కాత్రోత్ దుర్గయ్యతో వివాహం జరిగింది. వసంత దుర్గయ్య దంపతులకు ఇద్దరు సంతానం. గత సంవత్సర కాలం నుంచి వసంతను భర్త దుర్గయ్య మద్యం తాగుడుకు బానిసై నిత్యం ఇంట్లో గొడవ పడుతూ వేధిస్తున్నాడని ఆమె అత్త మామలైన జగ్యా దుర్గిలు కూడా వసంతను భర్తతో కలిసి వేధిస్తుం డడంతో విసిగిపోయిన ఆమె కుర్దు జానకంపల్లి తండా లోని ఆమె పుట్టింటికి వచ్చి అనంతరం ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. వసంత ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

ఫోన్‌లు అప్పగింత


పోగొట్టుకున్న ఫోన్‌లు అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

పట్టణంలోని ఒకటవ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు శనివారం 14 మొబైల్లను సిఈఐఆర్ పోర్టల్ సహాయంతో ట్రేస్ చేసి సంబంధిత బాధితులకు అప్పగించినట్టు ఒకటవ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ విజయ్‌బాబు తెలియజేశారు. వీటి విలువ సుమారు రెండు లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, మార్కెట్ తదితర రద్దీ ప్రాంతాలలోని మొబైల్ దొంగతనాల నుంచి జాగ్రత్త వహించాలని సూచించారు.

పలు బాధిత కుటుంబాలకు పరామర్శ


పరామర్శించిన పలువురు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని వేంపల్లి, కొత్తపల్లి గ్రామాలలో పలు బాధిత కుటుంబాలను శనివారం ఉదయం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి పరామర్శించారు. ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన బోట్ల రవి గత పది రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సునీల్ రెడ్డి ఆ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలను ఆర్థికంగా అందజేశారు. కొత్తపల్లి, వేంపల్లి గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, సీనియర్ నాయకులు ముస్కు మోహన్, కొమ్ముల శ్రీనివాస్, ఏలేటి రాములు, జక్క రాజేశ్వర్, జక్క గంగాధర్, ముస్కు ముత్తెన్న, ఏలేటి విజయ్, మల్లారెడ్డి, బద్దం సాగర్ రెడ్డి, జైడి చందా రవి, ఏట్టెం మహేష్, పోల ప్రవీణ్, గోపి యాదవ్, ప్రశాంత్, బొంబాయి రాజు పాల్గొన్నారు.

ఎస్సై మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

- అంబేద్కర్ యువజన సంఘం మండల సభ్యుల డిమాండ్
- అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం మండల నాయకులు

దళిత యువ ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మృతి చెందిన ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్‌కు నివాళులర్పించి, అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సుంకరి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావు పేట మండలం ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న దళిత యువ ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ జూన్ 30న మహబూబాబాద్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకొని మృతి చెందాడని తెలిపారు. ఎస్సై శ్రీనివాస్‌ను వ హా న ని క ం గా వేధించి, హింసించి ప్రాణాలు కోల్పోయే పరిస్థితికి కారకులైన సిఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ సన్యాసి నాయుడు, సుభాని, శేఖర్, శివనాగరాజ్‌లపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతిపై యుద్ధం చేసే నిజాయితీ గల పోలీస్ అధికారిని ఈ దుర్మార్గులు కక్షపూరితంగా ప్రాణాలు కోల్పోయేలా వేధించారన్నారు. పోలీస్ వ్యవస్థలో ఇలాంటి ఘటనలు జరగడం చాలా దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వం పోలీస్ శాఖ వెంటనే స్పందించి బాధితుడి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, మృతిచెందిన ఎస్సై భార్యకు గ్రూప్2 ఉద్యోగం, 5ఎకరాల భూమిని ప్రకటించి అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య, క్రియాశీల కార్యదర్శి గుర్రం నరేష్, కార్యవర్గ సభ్యులు లెక్చరర్ సాయన్న, మాజీ ఉపసర్పంచ్ పాలెపు చిన్న గంగారాం, పత్రి రవి తదితరులు పాల్గొన్నారు.

రాంపూర్ పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ


నోట్‌బుక్స్‌ను అందజేస్తున్న మాజీ సర్పంచ్

నవతెలంగాణ-ఆర్మూర్

రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మొదటి తరగతి నుంచి 5వ తరగతి వరకు నోట్ బుక్స్‌ను మాజీ సర్పంచ్ బొడ్డు గంగాధర్ శనివారం పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం సైతం నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఈరోళ్ల సాయన్న, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాహెరా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహారా కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం


కుట్టుమిషన్ అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ సహారా కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని సందీప్ గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ మాజీ గవర్నర్ ఎస్ఎస్ శ్యాంకుమార్ హాజరై కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవ అతిథులుగా డాక్టర్ కవితరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ హనుమంతరావు, లయన్స్ బసవేశ్వర రావు, లయన్ పెంటయ్య, లయన్ వీరేశంగుప్తా, లయన్స్ నరసింహారాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరై లయన్స్ సేవలను క్లుప్తంగా వివరించారు. లయన్స్ సహారా నూతన అధ్యక్షులుగా లయన్ నరసింహరావు, కార్యదర్శిగా లయన్ ధనుంజయరెడ్డి, కోశాధికారిగా లయన్ అహ్మద్‌లు ప్రమాణం చేసి 2024-25 సంవత్సరంలో ఎక్కువ సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో లయన్ ఉదయ సూర్య భగవాన్ చేసిన కుట్టు మిషన్ బాలమ్మకి అందజేసి తన తోటి వారికి సహాయపడాలని సూచించారు. ఈరోజు నుంచి సేవా కార్యక్రమాలు మొదలయ్యాయని అతిథులకు లయన్స్ సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్‌గా ఉదయ సూర్య భగవాన్, వ్యక్తగా చింతల గంగ దాస్, నాగేశ్వరరావులు వ్యవహరించారు.

కృష్ణవేణి పాఠశాల ఆధ్వర్యంలో మా పల్లె క్షేత్ర పర్యటన


వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఆర్మూర్

కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ ఎంఎం షరీఫ్ ఆదేశానుసారం సయ్యద్ బాజీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాలోని నర్సింగ్‌పల్లిలోని మా పల్లె క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందూర్ తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని, గానుగ వంటనూనెల తయారీ విధానం, వరిని నాటడం, వ్యవసాయంలోని రకాలు, అరటి పండ్లలోని రకాలను క్షేత్ర పర్యటనలో భాగంగా సందర్శించారు. చెరుకును ఏ విధంగా పండిస్తారో తెలుసుకొని చెరుకు ద్వారా బెల్లాన్ని ఏ విధంగా తయారు చేస్తారో చూయించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ మహమ్మద్ మిన్హాజ్ తెలిపారు. 100 సంవత్సరాల చెట్లను చూయించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చెయ్యాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపు రద్దు చెయ్యాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్ పట్టణంలో వినాయక్‌నగర్ కాలనీలో శ్రీ చైతన్య స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సెలవుల రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఎంఈవోకు ఫోన్‌లో ఫిర్యాదు చెయ్యడంతో యం.ఇ.ఓ తరగతులను వెంటనే మూసివేయాలని హెచ్చరించారు. సెలవుల్లో తరగతులు నడిపిస్తున్న శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపు రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు హక్కులను కాలరాస్తున్న పాఠశాలలో మీ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని విద్యార్థులకు తెలిపి ఇళ్ళకు పంపించారు. ఈ కార్యక్రమంలో టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్, గిరిజన విద్యార్థి సంఘం జైత్రాం రాథోడ్ టి.యస్.యఫ్ జిల్లా అధ్యక్షులు మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాస్

నవతెలంగాణ-ఆర్మూర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

21న ఇల్లెందు పట్టణంలో జరిగే మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు మోటారు రంగ కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం రాష్ట్ర మహాసభల పోస్టర్లను పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది మోటారు రంగ కార్మికులు ఉన్నారన్నారు. 2019 సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం రోడ్డు సేఫ్టీ బిల్లు పేరుతో మోటారు రంగ కార్మికుల నోట్లో మట్టి కొట్టుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యాదృచ్ఛికంగా ప్రమాదాలు జరిగితే దానికి పూర్తి బాధ్యత డ్రైవర్‌ను చేసి పది లక్షల జరిమానా పది సంవత్సరాల జైలు శిక్ష లాంటి కఠినమైన చర్యలకు మోడీ ప్రభుత్వం ఒడిగట్టిందని ఆయన తెలిపారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం మోటార్ వర్కర్స్ పని భద్రతను కొల్లగొట్టే 2019 ఎంవి యాక్ట్‌తో పాటు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఆందోళన చేశామని, మోడీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆయన తెలిపారు. మోటారు రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిగే మహాసభలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దాసు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు నసీర్, ఇంతియాజ్, మదు, హైమద్, ఆన్సర్, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న మొరం టిప్పర్


అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న టిప్పర్

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండల శివారులోని తానాకుర్ద గ్రామానికి చెందిన ఓ మొరం టిప్పర్ ఆటోను తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం జరుగలేదని స్థానికులు తెలిపారు. తృటిలో పెను ప్రమాదం తప్పిందని అన్నారు.

ఎన్టీఏ రద్దు చేయాలి

- నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలి
- స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి
- 15న రాష్ట్ర వ్యాప్త నిరసనలు
- ఏఐఎస్ఏ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రసెన్ జిత్


మాట్లాడుతున్న ఏఐఎస్ఏ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్‌టీఏ రద్దు చేయాలని, తెలంగాణ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రసెన్ జిత్ డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐసా జాతీయ నేతలు ప్రసెన్ జిత్, బీహార్ పాలింగంజ్ ఎమ్మెల్యే సందీప్ సౌరబ్, సీపీఐ (యంయల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజాతో కలిసి ఆయన మాట్లాడారు. నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని ఎన్‌టీఏ రద్దు చేయాలని, తెలంగాణ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జులై 15న రాష్ట్రవ్యాప్తంగా నిరసనకు పిలుపునిచ్చారు.

ఐసాను బలోపేతం చేయాలి : ఎమ్మెల్యే సందీప్ సౌరవ్

తెలంగాణ రాష్ట్రంలో ఐసాను బలోపేతం చేయాలని ఆ సంఘం జాతీయ మాజీ కార్యదర్శి పాలిగంజ్ ఎమ్మెల్యే సందీప్ సౌరవ్ అన్నారు. రెండు రోజులుగా జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర సదస్సు రాష్ట్ర ప్రతినిధుల సమావేశాలు శనివారం ముగిశాయి. 1990 దశలో ప్రత్యేక పరిస్థితి దేశ పరిస్థితుల్లో ఐసా విద్యార్థి సంఘం ఏర్పాటు చారిత్రాత్మకమైందని తెలిపారు. నూతన ఆర్థిక విధానాలు అమలు ప్రారంభ సమయంలో, మత విభజన రాజకీయాలు దేశాన్ని కుదిపేసిన సమయంలో, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం కోసం, విద్యార్థి లోకానికి దిశ దశ మార్గనిర్దేశం చేస్తూ ఐసా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా విద్యా ఉపాధి కోసం, ప్రజల ప్రజాస్వామిక హక్కులు డిమాండ్ల సాధన కోసం సంఘం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకులు ఉదయ్ కిరణ్, ఐసా రాష్ట్ర నాయకులు కిరణ్ కుమార్, అల్లి సాగర్, జ్వాలా, వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

లైబ్రరీ వద్ద స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న లైబ్రరీ అభివృద్ధి కమిటీ

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం (లైబ్రరీ) వద్ద లైబ్రరీ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు స్వచ్ఛభారత్ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా లైబ్రరీ పరిసరాలలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా లైబ్రరీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు స్వామిగౌడ్ మాట్లాడుతూ.. వర్షాకాలం సందర్భంగా లైబ్రరీ పరిసర ప్రాంతంలో పిచ్చిగడ్డి పెరిగి పాఠకులకు ఇబ్బందిగా మారిందన్నారు. ప్రత్యేకంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఇలా ప్రతినెల ఈ కార్యక్రమాన్ని చేపడతామని పాఠకుల సౌకర్యార్థం లైబ్రరీ పరిసరాలను అనుకూలంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రరీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి లింబూరి లక్ష్మణ్, ముఖ్య సలహాదారులు సింగడి పాండు, బొర్ర గంగారాం చెందుతున్న, గోదావరి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు

- మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్ మాదిగ తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత, గిరిజనుల మీద దాడులను, అత్యాచారాలను అరికట్టాలనే సదుద్దేశంతో ఎంతో పోరాటాల తర్వాత ఏర్పడ్డ ఎస్సీ, ఎస్టీ (పిఓఎ) చట్టాన్ని కొద్ది మంది తమ స్వార్థం కోసం వాడుకుంటూ బ్లాక్ మెయిల్‌లకు పాల్పడుతున్నారని తెలిపారు. వారి చర్యల వల్ల చట్టానికి ఉన్న గౌరవం పోతుందని, తమ స్వార్థ ప్రయోజనాలకోసం, రాజకీయ కక్షల కోసం ఇంత గొప్ప చట్టానికి ఉన్న విలువ తీయవద్దని హితవు పలికారు. చట్టాన్ని ఎత్తివేయాలనే కుట్రలను తిప్పికొట్టి ఈ చట్టాన్ని కాపాడుకుంటామని ఆయన పేర్కొన్నారు. తమ చట్టాన్ని దుర్వినియోగం చేసే వ్యక్తులపై ఫిర్యాదు చేస్తామని తెలియజేస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీన వరంగల్‌లో రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి కుడెల్లి ప్రవీణ్‌కుమార్ మాదిగ, గౌరవ సలహాదారు అందెల భవానిరెడ్డి, రాష్ట్ర నాయకులు సిర్పంగి దుర్గారాజ్ మాదిగ, సుంకపాక చంద్రం మాదిగ, జిల్లా నాయకులు గాదెపాగ గోపి మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు కావాలంటే ఏపీఎంలను సంప్రదించండి

- డిపిఎం సాయిలు


మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వ్యాపారం చేయాలనుకునేవారు.. బ్యాంకుల్లో రుణాలు కావాల్సిన వారు మండల కేంద్రాల్లో ఉండే ఏపిఎంలను సంప్రదించాలని ఐకెపి డిపిఎం సాయిలు అన్నారు. శనివారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ శివారులోని ఎస్బిఐ అర్‌ఎస్‌ఈటిఐ ఆధ్వర్యంలో జనరల్ ఈడిపి శిక్షణా ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐకెపి డిపిఎం సాయిలు పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న శిక్షకులకు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం మహిళా సంఘాల సభ్యులకు స్కూల్ డ్రెస్‌లు కుట్టడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు. కొందరు మహిళలు ఈ స్కూల్ డ్రెస్సులు కుట్టి లబ్ధి పొందుతున్నారని, ఇది మంచి అవకాశమని వివరించారు. శిక్షణలో నేర్చుకున్న వాటిని సద్వినియోగం చేసుకొని సమయం ఉంటే మండల కేంద్రాల్లో ఉండే ఐకెపి కార్యాలయానికి వెళ్లి స్కూల్ డ్రెస్‌లు కుట్టడం ద్వారా ఉపాధి పొందాలని సూచించారు. శిక్షణతో కుటుంబాలను హాయిగా గడుపుకోవచ్చని.. నేర్చుకున్న పట్టుదలతోనే జీవితంలో స్థిరపడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ అర్‌ఎస్‌ఈటిఐ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, భాగ్యలక్ష్మి రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ప్రజలు అప్రమతంగా ఉండాలి


- ఎస్సై మొహమ్మద్ యాసీర్ అరాఫత్


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై మొహమ్మద్ యాసీర్ అరాఫత్

నవతెలంగాణ-బాల్కొండ

రానున్న వారం రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారుల సూచన మేరకు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ తీరప్రాంతాలైన నాగపూర్, బస్సాపూర్ గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మొహమ్మద్ యాసీర్ అరాఫత్ సూచించారు. శనివారం శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ గ్రామాలను పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో ప్రజలు పురాతన ఇళ్లలో ఉండొదన్నారు. విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని సూచించారు. కాగా వర్షాలకు రైతులు తగుజాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై పేర్కొన్నారు.

అధ్వాన్న స్థితిలో రోడ్డు



నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని ఖానాపూర్ గ్రామం హనుమాన్ టెంపుల్ నుంచి గోదావరి (గంగకు) వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు శనివారం తెలిపారు. ఇటీవల కోమన్‌పల్లి గ్రామానికి చెందిన వారు ద్విచక్ర వాహనంపై పడి గాయాల పాలయ్యారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరినారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన



నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా అధికారుల ఆదేశానుసారం సీజనల్ వ్యాధుల పట్ల ఇంటింటికి తిరుగుతూ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారని వైద్యాధికారి హిమబిందు శనివారం తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, ఆశావర్కర్లు వీరమణి, రేణుక, సావిత్రి, చంద్రకళ, లావణ్య, పాల్గొన్నారు.

ఎల్ఓసి అందజేత



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన జూల హిందూజా బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో వారికి శాస్త్ర చికిత్స అవసరమని వైద్యులు తెలపడంతో భర్త కిరణ్‌కుమార్ ఆర్థికస్తోమత అంతగా లేకపోవడంతో వారు స్థానిక వార్డు కౌన్సిలర్ కొంతం మంజుల మురళీధర్ ఫోన్‌చేసి విషయం తెలుపగానే ఆయన స్పందించి వెంటనే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి సూచనలతో ఎల్ఓసి అందజేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2,50,000 ఇప్పించారు. అలాగే బాధితురాలి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకొని ఆపరేషన్ విజయవంతంగా చేయించారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

చిరుజల్లులకే చిత్తడి



బురదమయంగా మారిన సంత



మొరం కుప్పలపైనుంచి పశువులను ఎక్కిస్తున్న దృశ్యం

- **సమస్యల వలయంలో సాటాపూర్ సంత**

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ సంత తెలంగాణలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన సంత. ప్రతి శనివారం జరిగే ఈ సంతకు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు విచ్చేసి పశువుల క్రయవిక్రయాలు జరుపుతూ ఉంటారు. వర్షాకాలంలో సాటాపూర్ సంత అత్యంత దుర్గంధంగా మారుతోంది. దాంతో వ్యాపారస్తులకు తీవ్ర అవస్థలు తప్పడం లేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారస్తులకు ఎలాంటి సదుపాయాలు లేకపోవడం, వర్షాకాలంలో సంత పూర్తిగా బురదమయం కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంతలో వ్యాపారస్తులకు పశువులను తీసుకువెళ్లడానికి వచ్చే వాహనాలకు సరైన దిమ్మెలు లేకపోవడంతో మొరం కుప్పలను ఆధారం చేసుకొని వాహనాలలోనికి పంపిస్తున్నారు. ప్రతి శనివారం ఆదాయం వస్తున్నా.. పంచాయతీకి మౌలిక సదుపాయాలను తీర్చడంలో విఫలమవుతున్నారని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. చిరుజల్లులకే రోడ్లు బురదమయం కావడంతో క్రయవిక్రయాలు జరపడం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారి చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సాటాపూర్ సంతలో మౌలిక సదుపాయాలను సమకూర్చాలని వ్యాపారస్తులు కోరుతున్నారు.

సైలెన్సర్లు చిత్తు



సైలెన్సర్లను రోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గత రెండు మూడు నెలల నుంచి స్పెషల్ డ్రైవ్ పెట్టి, సీజ్ చేసిన అధిక శబ్దాన్నిచ్చే 60 మోటారు సైకిళ్ల సైలెన్సర్లను నిజాంసాగర్ ఎక్స్‌రోడ్డు వద్ద కామారెడ్డి డీఎస్పీ ఆధ్వర్యంలో రోడ్డు రోలర్ ద్వారా తొక్కించి, వాటిని డ్యామేజ్ చేసినట్టు పట్టణ సిఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇదివరకే కామారెడ్డి పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కామారెడ్డికి వచ్చేవారికి అధిక శబ్దాన్ని ఇచ్చే సైలెన్సర్లను మోటారు సైకిల్‌లకు బిగించకూడదని పలుమార్లు అవగాహన కల్పించామని తలెఇపారు. తిరిగి అదే విధంగా సైలెన్సర్లను వాడిన వారిని పట్టుకొని వారిపై మోటారు వాహనాల చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా వాహనాలను సీజ్ చేసి, ఆ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ అధికారులు



ఈత మొక్కలు నాటుతున్న అధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల పరిధిలోని వెల్లుట్లపేట గ్రామంలో వనమహోత్సవం పురస్కరించుకొని ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో ఈత మొక్కలు శనివారం నాటారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ మాట్లాడుతూ.. గీత కార్మికుల వృత్తి పరిరక్షణకై ఈత మొక్కలు నాటామని ఆయన అన్నారు. నాటిన మొక్కలను పెరిగేలా బాధ్యత తీసుకోవాలని, ఈతచెట్ల వలన గీత కార్మికులకు ఉపాధి పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో గీత కార్మికులు విట్టల్‌గౌడ్, సాయగౌడ్, దేవేందర్ గౌడ్, రాజేందర్‌గౌడ్, బాలకిషన్‌గౌడ్, రాజగౌడ్, రవీందర్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ భూమయ్య ఎక్సైజ్ కానిస్టేబుల్స్, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మోషన్‌పూర్ గ్రామానికి చెందిన పొన్నాల సంజీవరెడ్డి ఇటీవల పొలం పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. ఆయనను ఇంటి వద్ద మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గీరెడ్డి మహేందర్‌రెడ్డి పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరెడ్డి, మంగలి దత్తాత్రి, తదితరులున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్పల్లి గ్రామంలో గత కొన్ని నెలలుగా 7,8,9 వార్డుల పరిధిలోని గిరిజన తండాలో టిడిపి నిధులతో వేసిన బోర్‌లో సింగల్ ఫేస్ మోటారు లేకపోవడం వలన తాగునీటి ఎద్దడి నెలకొంది. దాంతో గ్రామస్తులు నీటి సమస్య పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్యదర్శికి, బోధన్ ఇంచార్జి ఎంపీడీవో శ్రీనివాస్‌కు పలుమార్లు విన్నవించారు. గ్రామస్తుల సమస్యను ఆలకించిన ఎంపీడీవో శ్రీనివాస్ తక్షణమే సింగిల్ ఫేస్ మోటర్ ఏర్పాటు చేసి గ్రామస్థుల నీటి సమస్యను తీర్చారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్యంతో ముందుకెళ్తే ఏదైనా సాధించొచ్చు

- **ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు**
- **వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే**

నవతెలంగాణ-లింగంపేట్



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

లక్ష్యంతో ముందుకెళ్తే ఏదైనా సాధించవచ్చునని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని కేవీఆర్ గార్డెన్స్ కొంపల్లిలో అయాతి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ వారు నిర్వహించిన ఫ్రెషర్స్ కంక్లేవ్ (వార్షికోత్సవ సాంస్కృతిక కార్యక్రమంలో) శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడి చదవాలని తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పోటీపడి చదివితేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. ఆయతి గ్రూప్ ఆఫ్ ఇండికేషన్ ఇన్‌స్టిట్యూట్ వారు ఎంతోమంది విద్యార్థిని, విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. నేడు దేశ విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు.

చినుకు జాడలేదు.. చెరువు నిండలేదు

నవతెలంగాణ-బోధన్

వర్షాకాలం ప్రారంభమై సుమారు నెలరోజులవుతున్నా వర్షాలు కురవకపోవడంతో చెరువులు నీరులేక కళావిహీనంగా తయారయ్యాయి. చెరువుల పరిధిలో నాట్లు వేసుకునే రైతులు వర్షాల కోసం ఆకాశంలో మేఘాల వైపు ఆశతో చూస్తున్నారు. ఇంత వరకు చినుకు జాడలేదు చెరువు నిండలేదు. ఇప్పటి వరకు బోర్లు ఉన్న రైతులు నాట్లు వేసిన భూమిలో నీటి మట్టం తగ్గిపోయి బోర్లు సైతం నీరు ఎత్తిపోయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏదేమైనా వరుణుడు కరుణిస్తే తప్ప రైతన్న తిప్పలు తీరేలాలేవు.



పొలాలకు వెళ్లే రోడ్డు కబ్జా చేశారు

- **కలెక్టర్‌కు ఫిర్యాదు**

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



కబ్జా చేసిన రోడ్డు స్థలం

మండలంలోని మల్కాపూర్ గ్రామం 7వ వార్డులో పొలాలకు వెళ్లే దారిని బిజెపి మండల అధ్యక్షులు, మాజీ వైస్ ఎంపీపీ పెద్దిడ్ల నర్సింలు కబ్జా చేశారని ఆరోపిస్తూ శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆశమొల్ల సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పలుకుబడితో వైస్ ఎంపీపీ హెూదాలో అధికార దుర్వినియోగానికి పాల్పడడం సరికాదని, గత 20 నెలల క్రితం పొలాలకు వెళ్లే దారిలో పెద్దడ్ల నర్సింలు అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్నారని గ్రామపంచాయతీలో ఫిర్యాదు చేశామని, స్థానికుల అభ్యంతరం తెలపడంతో గ్రామపంచాయతీ అధికారులు పనులు నిలిపివేశారని అన్నారు. అతని ఆగడాల గురించి గ్రామపంచాయతీలో ఫిర్యాదు చేసిన వారిని చంపుతానని బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అతని రాజకీయ పలుకుబడితో రైతులకు అన్యాయం చేయడం దారుణమని ఆరోపించారు. మళ్లీ ఇప్పుడు అనుమతి రాకముందే తిరిగి నిర్మాణ పనులు చేపట్టడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై విచారణ జరిపి రైతులు పంట పొలాలకు వెళ్లే దారిని కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్టు ఆయన తెలిపారు.

అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **ఏఐసిటియు రాష్ట్ర అధ్యక్షులు తుడుం అనిల్ కుమార్**

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న తుడుం అనిల్‌కుమార్

భవన నిర్మాణ కార్మికుల అసంఘటిత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐసిటియు రాష్ట్ర అధ్యక్షులు అనిల్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో భవన నిర్మాణానికి సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, చిన్నచిన్న సమస్యలకు కార్మికులను ఇబ్బంది పెడుతూ చదువురాని అమాయక కార్మికులను నానా అవస్థలకు గురి చేస్తున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఏఐసిటియు కార్మిక సంఘం అండగా ఉంటుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే కార్మికశాఖ ఇతర శాఖలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ సమస్యలపైన రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణ రూపొందించుకొని ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జి.శివాని, జిల్లా అధ్యక్షులు స్వామి, జబ్బర్ నాయక్, శేఖర్, సాయిలు, బాబు, స్వామి, గంగరాజు, రమేష్, నాగరాజు, అంజయ్య, రాజు, లింగం పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. అత్యవసరమైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి మందులు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి కరిపే రవీందర్, ఆరోగ్య కార్యకర్త శాంతకుమారి, ఆశావర్కర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



ఆలయానికి బైక్‌లపై వెళ్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-పిట్లం

రైతులు తాము వేసిన పంటలు కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. అందులో భాగంగా వర్షం కోసం శనివారం మండలంలోని ధర్మారం గ్రామ రైతులు తమ గ్రామ చుట్టుపక్కల 11 గ్రామాల హనుమాన్ మందిరాలను దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ హనుమాన్ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

15న మైనార్టీ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో ఈనెల 15న మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పద్మ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి మైనారిటీ కోటాలో 6 సీట్లు, 6వ తరగతి మైనార్టీ కోటాలో 1 సీటు, 9వ తరగతి మైనార్టీ కోటాలో 4 సీట్లు, 10వ తరగతి మైనార్టీ కోటాలో 14 బ్యాక్‌లాగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత గల విద్యార్థులు అడ్మిషన్‌ల కోసం ఎల్లారెడ్డి పట్టణంలోని పాఠశాలలో నేరుగా సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం, పౌష్టికాహారంతో కూడిన వసతి సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు.

శాంతి నికేతన్ విద్యాలయంలో హరితహారం

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని పాత రాజంపేట్ శివారులో గల శాంతినికేతన్ విద్యాలయంలో హరితహారం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రావణ్ కుమార్, పిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, ఉపాధ్యేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కవిత మాట్లాడుతూ.. మొక్కలు పెంచుకోవడం వలన భవిష్యత్తు తరాలు ఆనందంగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పిల్లలు ప్రతి పుట్టినరోజున ఒక మొక్కను నాటడం అలవాటు చేసుకోవాలని, పర్యావరణాన్ని కాపాడుకోవటం మన బాధ్యత అని పిల్లలకు సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది అందరూ కలిసి మొక్కలు నాటినట్టు పాఠశాల డైరెక్టర్ శ్రవణ్ కుమార్ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన సంగేం ముత్యం గత పదిహేను రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ప్రస్తుతం అతను నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వారి జిల్లా కుల సంఘం పెద్దలు శనివారం ఉదయం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడు జిల్లా అధ్యక్షులు గాండ్ల రామచందర్ మాట్లాడుతూ.. ఆదివాసి నాయకపోడు జిల్లా పెద్దలు, ఉద్యోగులు, సంఘ నాయకులు, యువకులు అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి వాట్సాప్ గ్రూప్ ద్వారా ఏకమై రూ.21,500లను బాధిత కుటుంబ సభ్యులకు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసి నాయకపోడు జిల్లా ప్రధాన కార్యదర్శి సాయన్న, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లోలం గంగాధర్, ప్రభుత్వ ఉపాధ్యాయులు మెట్టు రాజేశ్వర్, పుట్ట రాజేశ్వర్, హెూటల్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

హైదరాబాద్‌లో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డిని ఎల్లారెడ్డి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాంబోతుల సంపత్‌గౌడ్ శనివారం సన్మానించారు. కార్యక్రమంలో పలువురు ఎల్లారెడ్డి నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలో కోటార్మూర్ తిరుమల కాలనీ విశ్వబ్రాహ్మణ సంఘం తర్వ రెండు నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నట్టు గౌరవ అధ్యక్షులు శంకర్ తెలిపారు. అధ్యక్షునిగా కందకుర్తి శ్రీనివాస్, సెక్రటరీగా శ్రీకాంత్, కోశాధికారిగా పొడేపల్లి శ్రీధర్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కళ్యాణ్, కత్రాజీ శ్రీనివాస్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
4
ఆదివారం | జులై 14, 2024 | www.navatelangana.com

ద్విచక్ర వాహనాలు ఢీ.. వ్యక్తి మృతి



నవతెలంగాణ-భిక్కనూర్

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలోని పెద్దమల్లారెడ్డి రహదారిపై శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పాపూర్ గ్రామానికి చెందిన భూపాల్ (48) స్థానిక ఎంఎస్ఎన్ కంపెనీలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం కంపెనీకి వెళ్లడానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో భూపాల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన భూపాల్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి తరలించగా.. అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

- అన్న మృతి
- మామిడిపల్లిలో ఘటన

నవతెలంగాణ-ఆర్మూర్

అన్నదమ్ముల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న ఘటనలో అన్న మృతిచెందాడు. ఈ ఘటన పట్టణంలోని మామిడిపల్లిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని మామిడిపల్లికి చెందిన అన్నదమ్ములు ప్లాట్ విషయంలో శుక్రవారం గొడవ పడ్డారు. తమ్ముడు గంగాధర్ కర్రతో బలంగా అన్నను కొట్టడంతో మామిడిపల్లికి చెందిన వరికుప్పల నరసయ్య (36) అనే వ్యక్తి అక్కడికక్కడే కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు జిల్లా జిల్లా ఆస్పత్రికి తరలించారు. శనివారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నరసయ్య మృతి చెందాడు. చనిపోయిన ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాద పరిషత్ అధ్యక్షులుగా జగన్ మోహన్‌గౌడ్



మాట్లాడుతున్న అధ్యక్షులు జగన్ మోహన్‌గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా న్యాయవాద పరిషత్ అధ్యక్షుడుగా సీనియర్ న్యాయవాది బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం న్యాయవాద పరిషత్ కార్యాలయంలో పరిషత్ జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్ర న్యాయవాద పరిషత్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి మంగు లాల్ పాల్గొని సభ్యుల అభిప్రాయాలను సేకరించిన అనంతరం జగన్‌ను పరిషత్ అధ్యక్షుడుగా నియమింపచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విద్యార్థి పరిషత్ జిల్లా, రాష్ట్ర నాయకునిగా జగన్ బాధ్యతలు నిర్వహించారని, పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, న్యాయవాదిగా ఇరవై ఐదు ఏళ్లుగా ప్రాక్టీస్ చేస్తు విద్యార్థి, సామాజిక కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సంఘ్ పరివార్‌తో సుదీర్ఘంగా ఉన్న సంబంధాలను నేపథ్యంగా తీసుకుని న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్ష బాధ్యతలను అప్పగించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షునికి జగన్మోహన్‌గౌడ్‌కు రాష్ట్ర అధ్యక్షుడు పుష్పగుచ్ఛం అందజేసే శుభాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో న్యాయవాదులు బండారి కృష్ణనంద్, పడిగల వెంకటేశ్వర్, సి.సాయిరెడ్డి, మానిక్ రాజు, బిట్ల రవి, నారాయణ దాసు, విగ్నేష్, శాస్త్రి, కేశవరావు, వసంత్ రావు, ఉదయ కృష్ణ, బైరి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు బండా ప్రకాష్ ఆదేశాల మేరకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాగర్ జిల్లా అధ్యక్షులు మెతుకు శివ కుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ముదిరాజ్ భవనంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, కనకయ్య ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని, ఈనెల 15 నుంచి 27వరకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ అధికారుల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతి పత్రాలు సమర్పించడానికి నిర్ణయించామని తెలిపారు. కాంగ్రెస్ హామీ ప్రకారం ముదిరాజ్‌లను బిసి(డి) నుంచి బిసి(ఎ) పునరుద్ధరణ చేసి తక్షణమే దానిని బిసి(ఎ)లో మార్చడం జరగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మాహా సభ జిల్లా గౌర అధ్యక్షులు అంబేం అంబం బలరాజ్ ముదిరాజ్, రవి రాజ్, మత్స్య కార విభాగం అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, ముదిరాజ్ మీడియా అధ్యక్షులు సతీష్ ముదిరాజ్, రఘు రామ్ ముదిరాజ్, నిరడి భూమయ్య ముదిరాజ్, టుబష్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, నడిపి సాయి, చిన్న కాషాయ, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఎస్సీ గర్ల్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలో ఎస్టి గర్ల్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కన్వీనింగ్ కమిటీ సమావేశాన్ని స్థానిక సంతోష్‌నగర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఎస్టీ గర్ల్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టల్స్ ప్రారంభమవుతున్న వేళ ఎస్టి విద్యార్థినీలకు ప్రత్యేక హాస్టల్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో నాణ్యత కలిగిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని దాంతోపాటుగా ప్రభుత్వ పాఠశాలలను, కళాశాలలను ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి సందర్శించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను విడుదల చేయాలని అన్నారు. విద్య ప్రమాణాలను పెంచి విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మహేష్, డివిజన్ కన్వీనర్ పల్లపు శ్రావణ్ కుమార్, కోకన్వీనర్ వరప్రసాద్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

దిమ్మెలు నిర్మించారు.. వదిలేశారు..

- ప్రమాదాలు జరగకముందే చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-మాక్లూర్

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా ఉండటంతో నూతన దిమ్మెలను ఎత్తుపైకి ఏర్పాటు చేశారు. వాటిపై ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. రోజులు గడుస్తున్నా అధికారులు మాత్రం దిమ్మెలపై ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం లేదు. మండల కేంద్రంలోని డక్‌ఫారం నుంచి ముల్లంగి వెళ్లే రహదారి వెంట తక్కువ ఎత్తు గద్దెలపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. వాటి పక్కనే కొత్త దిమ్మెలు నిర్మించారు. కొత్త దిమ్మెలు నిర్మించి నెలలు గడుస్తున్నా వాటిని పైకి ఎక్కించడం లేదు. కొత్తవి, పాతవి అలాగే ఉండటంతో రైతులకు సమస్యగా మారింది. వరి నాట్లు, కోతల సమయంలో ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిమ్మెల విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే ట్రాన్స్‌ఫార్మర్లను కొత్త దిమ్మెలపైకి చేర్చాలని స్థానిక రైతులు అధికారులను కోరుతున్నారు.



నిర్మించిన దిమ్మెలపై ఏర్పాటు చేయని ట్రాన్స్‌ఫార్మర్

21న మహాసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 21న ఇల్లెందు పట్టణంలో జరిగే మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నిజామాబాద్ జిల్లా ఐఎఫ్‌టియు సహాయ కార్యదర్శి శివకుమార్ మోటారు రంగ కార్మికులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభల పోస్టర్లను జూలై 13తేదీన పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది మోటారు రంగ కార్మికులు ఉన్నారని ఆయన తెలిపారు. 2019 సంవత్సరంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రోడ్ సేఫ్టీ బిల్లు పేరుతో మోటారు రంగ కార్మికుల నోట్లో మట్టి కొట్టుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యాదృచ్ఛికంగా ప్రమాదాలు జరిగితే దానికి పూర్తి బాధ్యత డ్రైవర్‌ను చేసి పది లక్షల జరిమానా పది సంవత్సరాల జైలు శిక్ష లాంటి కఠినమైన చర్యలకు మోడీ ప్రభుత్వం ఒడిగట్టిందని ఆయన తెలిపారు. అంతేగాక మరో దిక్కు ఆర్టీఏ అధికారులు ట్రాఫిక్, సివిల్ పోలీస్ అధికారులు బండికి ఫిట్‌నెస్ లేదని చిన్నచిన్న కారణాలతో భారీగా పెనాల్టీలు విధిస్తూ, కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన తెలిపారు. మోటారు రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మురళి, ఆటో కార్మికుల నాయకులు బండమీది నరసయ్య, గంగారం, తిరుపతి, చిన్ని నరేష్, జావీద్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు

ఒకే వ్యక్తికి బినామీలపై ఉన్న ఏజెన్సీలను రద్దు చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. భూమయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఒకే వ్యక్తికి బినామీలపై ఉన్న ఏజెన్సీలను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.భూమయ్య అన్నారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో ఒకరిద్దరు వ్యక్తులు బినామీ పేర్ల మీద పదుల సంఖ్యలో పిల్లలు చదివే స్కూళ్లను మధ్యాహ్న భోజన ఏజెన్సీ పేరుతో తీసుకొని, భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఏ స్కూల్ వంట ఆ స్కూల్లో చేయాలని నిబంధన ఉందని, కానీ ఒకే దగ్గర వంట చేసుకుని వారికి సంబంధించిన స్కూళ్లకు భోజనాన్ని సరఫరా చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఏఐటీయూసీగా అనేకమార్లు జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. డీఈఓ ఇప్పటికైనా శ్రద్ధ వహించి జిల్లాలో బినామీ వ్యక్తుల పేర్ల మీద నిర్వహించే మధ్యాహ్న భోజన ఏజెన్సీలను రద్దుచేసి అర్హులైన వారికి అప్పజెప్పాలని తెలిపారు. రాబోయే కాలంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకే ప్రమాదకారిగా మారే ప్రమాదం ఉందన్నారు. నాణ్యమైన బియ్యం, కోడిగుడ్లు, సామగ్రిని ప్రభుత్వమే సరఫరా చేయాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చక్రపాణి కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా రూ.10,000 వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పిన్నెల హనుమాన్లు, ఆనంద్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

మహిళల సమస్యలు పరిష్కరించేందుకే మహిళా సంఘం

- సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బాలయ్య
- పిఓడబ్ల్యు మహాసభ

నవతెలంగాణ-సిరికొండ

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మహిళా సంఘం తోడ్పడుతుందని సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి వి.బాలయ్య అన్నారు. మండల కేంద్రంలోని గడ్కోల్ గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో గ్రామ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలపైన జరుగుతున్న అరాచకాలను, లైంగిక వేధింపులను నిలువరించడం కోసం మహిళా సంఘం ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు రాజకీయంగా అభివృద్ధి అయితేనే వారి సమస్యలు పరిష్కరించుకోగలుగుతారని ఆయన పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు రావాలన్నారు. సమాజంలో జరుగుతున్న అరాచకాలను అరికట్టేందుకు సావిత్రిబాయి ఫూలే ఆదర్శం కావాలని ఆయన తెలిపారు. ఆమె ఆశయాలను అందిపుచ్చుకుని మహిళా లోకం ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో (పిఓడబ్ల్యు) ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షులు మందాపురం సత్యవ్వ ఉపాధ్యక్షురాలు నిమ్మరాజుల సాయమ్మ ప్రధాన కార్యదర్శి మందాపురం వినోద, సహాయకార్యదర్శి వరలక్ష్మి, కోశాధికారి మల్కి రామలత, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

సామాజిక న్యాయం మానవ హక్కుల కౌన్సిల్ మండలాధ్యక్షులుగా లింగం

నవతెలంగాణ-ఎడపల్లి

సామాజిక న్యాయం మానవ హక్కుల కౌన్సిల్ మండలాధ్యక్షులుగా బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మంగళ్‌పహాడ్ లింగంను నియామిస్తూ రాష్ట్ర జిల్లా నాయకులు నియామకపత్రాన్ని అందజేశారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో సామాజిక న్యాయం కోసం, ప్రపంచ మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర జిల్లా నాయకుల ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రపంచ మానవ హక్కుల కౌన్సిల్ అధ్యక్షులు డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్, పలువురు మాట్లాడారు. స్వచ్ఛంద సేవకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఆయన తెలిపారు. సమస్యలు ఉన్నచోట పరిష్కారం కాకుంటే ఆ సమస్య పరిష్కారమయ్యేంతవరకు సుప్రీంకోర్టు వరకు వెళ్లే అవకాశం మన కౌన్సిల్‌కు హక్కు ఉందన్నారు. అనంతరం ప్రపంచ జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ మండల అధ్యక్షులుగా నియామకమైన మంగళ్‌పహాడ్ లింగం మాట్లాడారు. అధిష్ఠానం అధ్యక్షులు డాక్టర్ కొప్పుల విజయకుమార్ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష పదవిని కట్టబెట్టడం సంతోషంగా ఉందన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా తాను నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ పదవి రావడానికి కృషిచేసిన వరల్డ్, జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ పెద్దలకు పేరుపేరునా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు హనుమంతు, బోధన్ నియోజకవర్గ అధ్యక్షులు సాయి, సుభాష్, రాజేందర్, జిల్లా అధ్యక్షులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయం ముస్తాబు



నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే బోనాల పండుగకు ఆలయంలోని పోచమ్మ, ఊరడమ్మ, భూలక్ష్మమ్మ, మరిగవ్వలకు దేవతల విగ్రహాలను రంగు రంగులతో ముస్తాబు చేశారు. పండుగ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడమే కాక, పోతారాజులు కూడా వస్తారని తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఉత్సవంలో ఆనందంగా పాల్గొనాలని గ్రామపెద్దలు పేర్కొన్నారు.

తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రేమ్‌లాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నిజామాబాద్ జిల్లాకు చెందిన రచయిత, టీచర్ బానోత్ ప్రేమ్‌లాల్‌ను నియమించినట్టు తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడీ సతీష్‌రెడ్డి తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా పత్రికా రంగంలో రాణిస్తూ వివిధ పత్రికలకు సంచలనాలకు మారుపేరైన శీర్షికలు, వ్యాసాలు రాస్తూ అందరి ఆదరాభిమానాలు చూరగొంటున్న ప్రేమ్‌లాల్ ప్రతిభను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామకం చేసినట్టు రాష్ట్ర అధ్యక్షుడు కామిడీ సతీష్‌రెడ్డి తెలిపారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షులు సతీష్‌రెడ్డికి ప్రేమ్‌లాల్ కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రానికి చెందిన సలావుద్దీన్ నెల రోజుల క్రితం ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ సెల్‌ఫోన్‌ను బాల్కొండ ఎస్ఐ మొహమ్మద్ యాసీర్ అరాఫత్ శనివారం బాధితుడు సలావుద్దీన్‌కు అప్పగించారు.



ఫోన్ అందజేస్తున్న ఎస్సై

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

- కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ రాజు సంగని



మాట్లాడుతున్న చైర్మన్ రాజు సంగని

నవతెలంగాణ-బాల్కొండ

ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ రాజు సంగని అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఆయన జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులో చదివించిన అప్పటి ఉపాధ్యాయులు కృషి వల్లనే మనమూ నేటి ఉపాధ్యాయులుగా ఎదిగామని తెలిపారు. ఉపాధ్యాయుల బోధనతో వివిధ రంగాలలో స్థిరపడ్డారని సూచించారు. చిన్నస్థాయి నుంచే విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో పాటు మంచి విద్యను బోధించాలన్నారు. కార్యక్రమంలో కృష్ణవేణి విద్యాసంస్థల ఇంచార్జి డైరెక్టర్లు ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, గీత, అకాడమిక్ డైరెక్టర్ మురళి శ్రీవాస్తవా, విజయ్ సారథి, జోనల్ మేనేజర్ సంపత్ కుమార్, పాఠశాల డైరెక్టర్లు కోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మణ్, మెట్‌పల్లి, రుద్రాంగి, బాల్కొండ కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్స్ విజయ్ కర్తన్, హరినాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.